'చదువు'ల సారం - 4

# అనుభవాలు పంచుకుందాం-2



'చదువు'ల సారం-4

# అనుభవాలు పంచుకుందాం
# 2

మంచి పుస్తకం

జన విజ్ఞాన వేదిక

## ‘చదువు’ల సారం - 4 : అనుభవాలు పంచుకుందాం - 2

**(డిపిఇపి ద్వారా ప్రచురితమైన ‘చదువు విజ్ఞానం’ పత్రిక నుండి సంకలనం)**

ప్రచురణ : సెప్టెంబరు, 2010

ప్రతులు : 2000

**వెల : రూ. 110/-**

ISBN : 978-93-80153-40-7

ప్రచురణ, ప్రతులకు : **జన విజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం**
162, విజయలక్ష్మి నగర్
నెల్లూరు - 524 004.
ఫోన్ : 9440503061.

**మంచి పుస్తకం**
12-13-450, వీధి నెం.1,
తార్నాక, సికింద్రాబాద్-500 017.
ఫోన్ : 94907 46614
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

కంపోజింగ్ : సుధామయి

డిజైన్ & ముద్రణ:
చరిత ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాదు - 500020. ఫోన్ : 040-27678411.

### కృతజ్ఞతలు

- చదువు విజ్ఞానం పత్రికను ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డిపిఇపి వారికి
- చదువు విజ్ఞానం సంపాదక వర్గానికి, సంపాదకులు వి. బాలసుబ్రమణ్యంగారికి
- రచనలు, అనువాదాలు చేసినవారికి, అవి ముందుగానే ప్రచురితమైన పుస్తకాలు, పత్రికలకు
- చదువు విజ్ఞానం పత్రికకు బొమ్మలు వేసిన చంద్ర, ఇతర కళాకారులకు

శ్రీ మొహమ్మద్ అలీ రఫత్, ఐ.ఏ.ఎస్.
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్
రాజీవ్ విద్యా మిషన్ (ఎస్ ఎస్ ఏ)
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందు మాట

*విద్యాహక్కు చట్ట ఉద్దేశాలను సాధ్యం చెయ్యటంలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది. నైపుణ్యమూ, నిబద్ధతా ఉన్న అతి పెద్ద ఉపాధ్యాయ బృందం ప్రభుత్వానికి ఉంది. అప్పటి జిల్లా ప్రాథమిక విద్యా పథకం (డిపెప్) ఆధ్వర్యంలో 1998 నుంచి 2006 వరకు ప్రచురించిన 'చదువు విజ్ఞానం' మాసపత్రికలో వాళ్ళు రాసిన కథలు, వ్యాసాలే ఇందుకు నిదర్శనం. బడి, బడి నేపథ్యంగా ఉండే సమాజానికి సంబంధించిన అనేక అనుభవాలను ఉపాధ్యాయులు ఈ పత్రిక ద్వారా పంచుకున్నారు. ఆటలు, కథలు, పాటలు, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు వంటి పలు అంశాల గురించి వాళ్ళు రాశారు.*

*'చదువు విజ్ఞానం' పత్రికలో ప్రచురితమైన కొన్ని శీర్షికలను మంచి పుస్తకం, జన విజ్ఞాన వేదిక కలిసి పుస్తక రూపంలో ప్రచురించటం సంతోషంగా ఉంది. ఈ పత్రిక ప్రచురితమవుతున్న కాలంలో అనేక మంది ఉపాధ్యాయులకు ఇది స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పత్రికలోని అంశాలు పుస్తకరూపంలో రావటంతో అవి చక్కటి రిఫరెన్స్ మెటీరియల్‌గానే కాకుండా ఉపాధ్యాయ బృందానికి ప్రేరణగా నిలుస్తాయనటంలో సందేహం లేదు. దీంట్లోని పలు అంశాలు ఉపాధ్యాయుల ప్రత్యక్ష అనుభవాల నుంచి పంచుకున్నవి. బోధనా నాణ్యతను పెంపొందించటానికి, నేర్చుకునే వాతావరణాన్ని మెరుగు పరచటానికి అందరం కృషి సల్పుతున్న ప్రస్తుత నేపథ్యంలో ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి.*

తేదీ : 18/08/2010 (మొహమ్మద్ అలీ రఫత్, ఐ.ఏ.ఎస్.)

# లెక్కలు కావాలి సార్!

నేను కడప జిల్లా రామాపురం మండలం మండల ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో పనిచేస్తున్నాను. పాఠం మధ్యలో "అసలు ఇల్లు కట్టాలంటే ఏమేమి వనరులు కావాలి?" అని



ప్రశ్నించాను. ఒక్కొక్క పిల్లవాడు ఒక్కొక్క జవాబు చెపుతున్నాడు. మట్టి, ఇసుక, సిమెంటు, ఇటుకలు, కడ్డీలు, చెక్కలు... ఇలా పిల్లలతో అన్నీ రాబట్టగలిగాను అన్న సంతోషంలో ఉన్న నాకు ఒకటవ తరగతి చదివే దర్బార్ అనే విద్యార్థి లేచి నిలబడి "టీచర్! అన్నింటికన్నా ముఖ్యంగా ఇంకొకటి కావాలి," అన్నాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. 'ఇంకేమిటి కావాలబ్బా! అన్నీ దాదాపుగా చెప్పేశారు కదా' అని మనసులో అనుకొని దానిని బయటకు కనబడనీయకుండా పిల్లలందరితో "ఇల్లు కట్టడానికి ఇవే కాకుండా, ఇంకొక ముఖ్యమైన వనరు కావాలి. అది ఏమిటో ఇపుడు మన దర్బార్ చెప్తాడు," అని చెప్పగానే ఆ విద్యార్థి హుషారుగా లేచివచ్చి "ఇల్లు కట్టాలంటే అన్నింటికన్నా ముఖ్యంగా లెక్క (డబ్బు) కావాలి టీచర్," అన్నాడు. ఆశ్చర్యంగా, సంతోషంగా ఆ పిల్లవాడ్ని మనస్ఫూర్తిగా అభినందించాను.

ప్రస్తుత కాల పరిస్థితుల్లో అన్నింటికన్నా ముఖ్యంగా ఉండవలసింది అదే కదా. అది తెలిసిన విషయమే అయినా ఆ సమయంలో నాకు తోచనందుకు నన్ను నేనే నిందించుకొన్నాను. ఆ విద్యార్థి చాలా అల్లరివాడు. అంత అల్లరిలోనూ అంతర్గతంగా వాడిలో ఉన్న తెలివితేటలకు నాకు చాలా ముచ్చటేసింది. తరగతి గదిలో విద్యార్థులకు మనం బోధించటమే కాదు, పిల్లల నుండి మనం తెలుసుకోవలసింది కూడా ఉంటుందనిపించింది.

**– డి. విజయ,** రామాపురం,

జనవరి, 2002

# కారెవరూ చదువుకనర్హం

'చదువు' పత్రికను చదివి, ఆ స్ఫూర్తితో నేను చాలా రకాల కార్యక్రమాలు తరగతి గదిలో నిర్వహిస్తున్నాను. అదేవిధంగా ఒక సంచికలో నెల్లూరు జిల్లాలో శివరాం, ఎలినా వాట్స్ గార్లు భాష గురించి చేస్తున్న ప్రయోగాలు చదివి చాలా ప్రేరణ పొందాను. ఆ స్ఫూర్తితో 5వ తరగతి పిల్లలకు రెండవ పాఠం తర్వాత ఉన్న శ్రీశ్రీ కవిత –

కుక్కపిల్ల<br>
అగ్గిపుల్ల<br>
.......

ఈ కవితకు పేరడీలు రాయమని పిల్లల్ని ప్రోత్సహించాను. కొన్ని ఉదాహరణలు కూడా చెప్పాను. అంతే! ఇక చూస్కోండి మా చిన్నారుల కలాలు ఎంత వేగంగా కదిలాయో –

| | | |
|---|---|---|
| ఓ అమ్మాయి | – | బొట్టు బిళ్ళ |
| | | కాటుక పుల్ల |
| మరో తుంటరి | – | బోడిగుండు |
| | | పూలచెండు |
| ఓ తిండిపోతు | – | మురుకులు కరకర |
| | | బఠానీలు పరపర |

ఇంకా ఎన్ని ఆణిముత్యాలో...

ఆవు పేడ<br>
లేగ దూడ<br>
పాముపుట్ట<br>
మొగలి బుట్ట<br>
ఇరుగుపొరుగు<br>
పరుగో పరుగు<br>
చల్లని గాలి<br>
బాబోయ్ గిలి<br>
నాకు పెద్ద పలక<br>
చెల్లికేమో గిలక<br>
తలలో చుండు<br>
చేసెయ్ గుండు<br>
చెక్క పలక నలుపు<br>
సుద్దముక్క తెలుపు



గూట్లో రూపాయి
కావాలా పాపాయి?
నీళ్ళ బిందె ఇత్తడి
అమ్మ ముద్దులు పుత్తడి
అడ్డం ఆకాంక్షం
నిలువు రేఖాంశం
పందిరిగుంజ
పెదతాటి ముంజ
చింతపండు
మిరప్పండు చురుకు
ప్రశ్న రెడ్డింకు
జవాబు నల్లింకు
మా ఊర్లో సోమవారం అంగడి. దాంతో...
సోమవారం అంగడి
పేటంతా సందడి

ఇలాంటి పదాల గారడీలు ఎన్ని చేశారో మా బుల్లి శ్రీశ్రీలు. స్థలాభావం వల్ల అవన్నీ రాయలేకపోతున్నందుకు బాధగా ఉంది. ఏది ఏమైనా పిల్లలే కదా అని తేలిగ్గా చూడకుండా, వారికి సరైన ప్రోత్సాహం ఇస్తే దేంట్లోనైనా తమ ప్రతిభ చూపుతారు. బోధించడం అంటే బాధించడం కాదు. మనం వాళ్ళకి 'శిక్ష'కులుగా మాత్రమే కాక, వాళ్ళ మనసు లోతుల్లోకి వెళ్ళగలిగే మిత్రులమైతే మన విద్యాలక్ష్యాలన్నీ నెరవేరతాయి. అందుకే అనాలనిపిస్తుంది 'కారెవరూ చదువుకనర్హం – పసికూనల ప్రతిభ అనర్ఘం' అని.

– **డి. దుర్గాబాయి,** సిరిపురం,
జనవరి, 2002

# వాల్‌పోస్టర్లే వాచకాలు

నేను విజయనగరం జిల్లా వేపాడ మండలానికి ఒక రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నాను. మా మండలంలో జగ్గయ్యపేట అనే ఓ గ్రామం ఉంది. ఈ ఊళ్ళో బడి ఈడు పిల్లలలో బడిలో నమోదు కానివాళ్ళు లేరు. కాకపోతే బడి మధ్యలో మానేసినవాళ్ళు మాత్రం కొంతమంది ఉన్నారు. వాళ్ళు కేవలం స్నేహితులతో కలిసి ఆటలు ఆడడం కోసం మానేసినవాళ్ళే.

వాళ్ళని తిరిగి చేర్పించడానికి నేను, ఆ ఊరి టీచర్లు కలిసి ఒక ప్రణాళిక తయారుచేసాం. వాళ్ళని ఒప్పించి రప్పించి మొదట ఒక పదిరోజులు కేవలం ఆటలే ఆడించాం. దానివల్ల



వాళ్ళు బడిని ఒక ఆటస్థలంగా భావించి రోజూ రావడం మొదలెట్టారు. వాళ్ళు వేరువేరు వయస్సుల వాళ్ళు కావడం వల్ల మిగిలిన పిల్లలతో కలవలేకపోయేవారు. వాళ్ళందరినీ ఒక గ్రూపుగా ఏర్పరచి వాళ్ళకి అప్పటికే కొంత అక్షర జ్ఞానం ఉండడంవల్ల అవి జ్ఞప్తికి తెప్పించడానికి ప్రయత్నించాం. సాఫల్యం పొందలేకపోయాం.

అప్పుడు వాళ్ళకి ఇష్టమైన అంశం ఏమిటో తెలుసుకొన్నాం. ఆ గ్రామం నాలుగైదు గ్రామాలకి ప్రధాన కూడలి అవటంతో అక్కడ పక్క మండలాలలో ఆడే సినిమా వాల్‌పోస్టర్లు అంటిస్తుంటారు. ఆ వాల్ పోస్టర్ దగ్గరే తరచూ వీరు ఉండడం గమనించి ఆ పోస్టర్లను, పేపర్లలో సినిమా కట్టింగ్స్‌ను సేకరించి వాళ్ళతో ఆ సినిమా పేర్లు చెప్పించి వాటినే చూసి రాయమనేవాళ్ళం. వాళ్ళకి పేరు చదవడం రాకపోయినా హీరో, హీరోయిన్ల బొమ్మలు చూసి ఆ సినిమా పేరేమిటో చెప్పేసేవారు.

అలా ఆ పేర్లలోని అక్షరాలతో కొన్ని కొత్త పదాలను వాటితో వాక్యాలను చెప్పించాం. వాళ్ళకి గుణింతాలు, వ్యాకరణంలాంటివి నేర్పకపోయినా పాఠాలను చూసి చదవగలిగే స్థాయికి తీసుకెళ్ళగలిగాం. వాళ్ళలో ఇద్దరు 5వ తరగతి పాసై 6వ తరగతిలో చేరారు కూడా.

పద్ధతుల ప్రకారంగా బోధించకపోయినా అక్షరాస్యులుగా చేసి వాళ్ళని మళ్ళీ పాఠశాలకు వచ్చేటట్లు చేసాం. ఆ తృప్తే మాకు మిగిలింది.

**– జి.ఎస్. కాంతారావు,** వేపాడు మండలం,

జనవరి, 2002

# మనసు కరిగిన వేళ...

నాకు గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయినిగా పనిచేసిన అనుభవం ఉంది. మనసు పొరల్లో నిక్షిప్తం అయిన వినోద, విషాద సంఘటనలు కోకొల్లలు. అయినా ఇంతగా మనసు మథనపడిన జ్ఞాపకం తక్కువే.



ఒకటవ తరగతిలో కరిష్మా బేగం అనే పేరుతో ఒక చిన్నపాప ఎపుడూ లేటుగానే వస్తూ ఉంటుంది. చీటికీ మాటికీ బడి మానేసేది. ఎన్నిసార్లు చెప్పినా పద్ధతిలో మార్పులేదు. చెప్పిచెప్పి విసిగిపోయానేమో దసరా సెలవుల అనంతరం ఆలస్యంగా వచ్చిన కరిష్మాను దగ్గరకు పిలిచాను. బెదురుతూ వచ్చింది. "ఎందుకు ఆలస్యం అయ్యింది?" అని గదమాయించాను. ఆ మాత్రానికే ఆ లేత మనసు బెదిరిపోయింది. కళ్ళనీళ్ళు జలజల రాలాయి. నీళ్ళు నిండిన ఆ చిన్ని కళ్ళు నాలో వివేకాన్ని తట్టినట్లు అనిపించింది. "ఇక ఎప్పుడూ ఆలస్యంగా రాకు," అని అనునయించి పంపాను. కానీ ఆ పాప ఆ రోజంతా నా దగ్గరకు రాలేదు.

ఆ తర్వాత వారం రోజులు కరిష్మా క్లాసుకు రాలేదు. పిల్లల్ని వాళ్ళ ఇంటికి పంపితే తాళం వేసుందని చెప్పారు. బహుశా ఊరు వెళ్ళి ఉంటారనుకున్నాను. వాళ్ళ అమ్మను ఎన్నిమార్లు పిలిచినా వచ్చేదికాదు. పన్లోకి వెళుతుంది, అందుకని రాదావిడ. పిల్లను చీటికీ మాటికీ బడి మానిపించవద్దనీ, బడికి సక్రమంగా పంపమనీ చెబుదామని నేనే ఒకరోజు ఆమె దగ్గరకు వెళ్ళాను. నేను ఏమీ అనకముందే ఆమె అందుకొని "టీచరమ్మా! పిల్లను కోప్పడకండమ్మా! రెక్కాడితేగానీ డొక్కాడదు. పనికెళ్ళకపోతే పిల్లలు పస్తేనమ్మా! నాకు ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని మా ఆయన నన్ను వదిలేసి మరో పెళ్ళి చేసుకున్నాడు. అప్పుడప్పుడూ నేను సంపాదించిన డబ్బుకూడా పట్టుకెళతాడు. తట్టుకోలేక పుట్టింటికి వెళ్తే వాళ్ళు పోషించలేమని తిరిగి పంపిస్తారు," అని చెప్పింది. పైగా తన పిల్లల్ని శక్తిమేర చదివిస్తానని ఆ నిస్సహాయ తల్లి చెబుతుంటే ఆమె పట్టుదలకు అభినందించాలో, వాళ్ళ నాన్న కసాయితనానికి బలి అవుతున్న పిల్లల్ని చూసి జాలిపడాలో, పిల్లల కుటుంబ నేపథ్యం తెలుసుకోకుండా వారిపై కోప్పడినందుకు సిగ్గుపడాలో అర్థంకాక నిలుచుండిపోయాను.

**– యమ్. రాణి,** ముండ్లపాడు,

జనవరి, 2002

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1085**

* * *

Read other books by Manchi Pustakam@

**http://kinige.com/kbrowse.php?via=author&id=46**